సాక్షి
పెద్దపల్లి
ఆదివారం | 2 | జూలై | 2023

న్యూస్‌రీల్

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్య సాధన దిశగా నడవాలని, తద్వారా అన్ని రంగాల్లో రాణించవచ్చని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం గోదావరిఖని రమేశ్‌నగర్‌లోని మహాత్మజ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యులు శైలజా, శ్రీనివాస్, న్యాయవాదులు శ్రీనివాస్, కుర్తి కుమార్, రత్నం, లింగస్వామి, అవినాష్, సదస్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో 4,209 మి.యూ విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో 2023–24 జూన్‌లో 4,209.88 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు అధికార వర్గాలు తెలిపారు. 74.14 శాతం పీఎల్‌ఎఫ్‌తో పూర్తి చేసినట్లు వెల్లడించారు.

ఢిల్లీ కాన్ఫరెన్స్‌లో కేడీసీసీబీ డైరెక్టర్



ఢిల్లీ సదస్సులో శ్రీగిరి శ్రీనివాస్

సుల్తానాబాద్: ఢిల్లీలో శనివారం జరిగిన ఇండియన్ కో–ఆపరేటివ్ కాంగ్రెస్ కాన్ఫరెన్స్‌లో కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎన్‌సీయూఐ నిర్వహించిన ఈ సదస్సులో సహకార సంఘాల బలోపేతానికి చొరవ తీసుకున్నందుకు సంఘాల అధ్యక్షులను అభినందించారని పేర్కొన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పీఏ సీఎస్‌లు ఎదగాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి చిన్నకల్వల సింగిల్ విండో చైర్మన్ మోహన్‌రావు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

శక్తి బూత్ ఇన్‌చార్జీలతో 'సోమారపు' భేటీ



సూచనలిస్తున్న సత్యనారాయణ

రామగుండం: బీజేపీని ఇంటింటికీ తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన తీరుపై పార్టీ విస్తారక్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో శనివారం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అంతర్గాంలో సమావేశమయ్యారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో మేరా బూత్ మేరా మజ్‌బూత్‌లో భాగంగా రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలలో కేంద్ర ప్రభుత్వ వాటా తదితర అంశాలను అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ అంతర్గాం మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నియోజకవర్గ కన్వీనర్ పిడుగు కృష్ణ, మండల ఇన్‌చార్జి విస్తారక్ వీరమల్ల ప్రేమ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

అమ్మే ఆది గురువు

- పిల్లల చదువుల వెనక తల్లి శ్రమే ఎక్కువ
- నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు..
- ఆలనలో అగ్రభాగం అమ్మే..
- హోంవర్క్‌లో పూర్తి భాగస్వామ్యం



చదువుకోండమ్మా: హోం వర్క్ చేయిస్తున్న తల్లి రజిత

త్వరత్వరగా: కొడుకుకు స్నానం చేయిస్తున్న సంధ్య

హర్దినికి జడ వేస్తున్న రూపాన్సీ

తినునాన్నా: కొడుకుకు టిఫిన్ తినిపిస్తున్న శిల్ప

నడుచ్.. నడుచ్: కూతురుకు బ్యాగ్ వేస్తున్న హారిక

బైబై: స్కూల్‌కు వెళ్తున్న చిన్నారి

చలోచలో: పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్తున్న తల్లి



గుడ్ మార్నింగ్: పొద్దున్నే నిద్రలేస్తున్న తనీశ్, హన్సిక

లే నాన్నా.. స్కూల్‌కు టైం అవుతోంది.. త్వరగా రెడీ కావాలంటూ.. దుప్పట్లోంచి పిల్లల్ని బుజాలపై ఎత్తుకెళ్లి బ్రష్ చేయించి.. స్నానం పోస్తుంది. స్కూల్ యూనిఫాం తొడిగి.. టిఫిన్ తినిపించి.. లంచ్‌బాక్స్, బుక్స్‌ను బ్యాగులో సర్దుతుంది. గేటు బయటివరకూ తీసుకెళ్లి బడికి పంపిస్తుంది. పిల్లలు సాయంత్రం వచ్చేసరికి స్నాక్స్ సిద్ధం చేస్తుంది. వారు ఆడుకుంటుంటే స్నేహితురాలిగా.. హోంవర్క్‌లో టీచర్‌గా మారుతుంది. అలిసిపోయిన పిల్లలకు మళ్లీ అన్నం తినిపించి గుండెలపై పడుకోబెట్టుకుని అప్పుడు నిద్రపోతుంది అమ్మ.

పిల్లలను స్కూల్‌కు పంపించడం అంత సులువేం కాదు. కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు చకచకా పిల్లల్ని సిద్ధం చేస్తేనే వారు సమయానికి పాఠశాలకు వెళ్తారు. కొంచెం పెద్దవాళ్లయితే పర్లేదుగానీ.. 5– 10ఏళ్ల వారిని రెడీ చేయడం తల్లులకు నిత్యం ఒక టాస్క్. గృహిణులకు కొంత ఉపశమనం ఉంటున్నా.. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లేవారు పోటీ పడాల్సిందే.

వేకువజాము నుంచే..

తల్లులకు వేకువజాము మేల్కొనడంతోనే పనులు మొదలవుతాయి. ఇంటి పనులు త్వరగా పూర్తి చేసి.. పిల్లలకు నీళ్ల వేడి చేయడం.. స్నానాలు చేయించడం, దుస్తులు వేయడం, టై, బెల్టు పెట్టడంతోపాటు పలక, బలపం బ్యాగులో సర్దడం కూడా తల్లులే చేస్తున్నారు. పిల్లలు చిన్నవాళ్లు అయితే పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు బ్యాగులో ఉన్నాయా..? లేవా..? పెన్సిల్ వంటివి సరిచూసి బ్యాగు సిద్ధం చేయడం కూడా తల్లుల వంతే. వారు పాఠశాలకు వెళ్లాక దుస్తులు శుభ్రం చేయడం నుంచి దుస్తులు ఇస్త్రీ చేయడం వరకు తల్లులే బాధ్యత తీసుకుంటున్నారు. చివరకు చుట్టాలు, ఇరుగు పొరుగు వారిని ఏయే వరుసలతో పిలవాలో నేర్పించేది తల్లే. పిల్లలకు ముందుగా వచ్చీరాని మాటల దగ్గర నుంచి మొదలుకొని సంస్కారవంతమైన చక్కటి అలవాట్లను నేర్పించడంలో తల్లి పాత్ర కీలకం.

ప్రతిరోజూ హోంవర్క్

పిల్లలు సాయంత్రం ఇంటికి చేరుకున్నాక వారితో హోంవర్క్ చేయించేది కూడా తల్లే. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలను ఒడిలో కూర్చోబెట్టుకొని హోంవర్క్ చేయిస్తున్నారు. సతాయిస్తున్నా.. సముదాయిస్తూ వారితో హోంవర్క్ పూర్తి చేయిస్తారు. పిల్లలు పెద్దవారైతే వారిని ట్యూషన్‌కు పంపించడం.. రాగానే ఏం చెప్పారో తెలుసుకోవడం.. పాలు తాగించడం.. ఇలా వారు నిద్రపోయే వరకూ అన్నీ తల్లే చూసుకుంటోంది.

తల్లికి సముచిత స్థానం

పిల్లల చదువుల్లో తల్లుల పాత్ర పెరగడంతో ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయిలోనూ తండ్రి పేరుతోపాటు తల్లి పేరు కూడా ఫారాల్లో రాయాల్సిందిగా నిబంధనలు పెట్టారు. కొన్ని పాఠశాలల్లో తల్లుల పేర్లు, ఫోన్ నంబర్లను కూడా తీసుకుంటున్నారు. మాతృమూర్తి ప్రథమ గురువు అని చెప్పడమే కాదు, అక్షరసత్యం.

క్రమశిక్షణ అలవడుతుంది



పిల్లలకు ఇంటి వద్ద క్రమశిక్షణ నేర్పిస్తాం. మేం చేసే అలవాట్లే వారిని సరైన దారిలో పెట్టేందుకు ఉపయోగపడతాయి. మా పాప సహస్ర 6వ తరగతి చదువుతోంది. ప్రతి రోజు యూనిఫాంతోనే స్కూల్‌కు అటెండ్ అవుతుంది. అందుకు తగ్గట్టే నేను కూడా పాపను రెడీ చేస్తాను. రెండు జడలు వేయాలంటే 10 మార్కుల జవాబు రాయాల్సినంతా పని అవుతుంది. అయినా రెండు జడలు వేసి పంపిస్తాను. – కన్న శ్వేత, డాక్టర్ స్ట్రీట్

పిల్లలకంటే గంట ముందుగానే



మా పాప మేఘన అల్గునూర్‌లోని స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. పిల్లల కంటే గంట ముందుగానే లేచి ఇంట్లో పని మొత్తం చేసుకుంటాను. పాప లేచాక స్కూల్‌లో దింపి వచ్చేవరకు ఏ పని చేయను. పిల్లలను లేపడం స్నానం చేయించి రెడీ చేయడం పెద్దపని. ఆ పనులు అయిపోతే మిగిలిన పనులు సులువుగా చేసుకోవచ్చు. – పంబాలు సంధ్య, అల్గునూర్

మేమే బడికి పోయినంత పని



మేం బోయవాడలో ఉంటాం. మా పాప రూప కొత్తపల్లిలోని స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజు కమాన్ వరకు బైక్‌పై డ్రాప్ చేసి స్కూల్ బస్సు ఎక్కించి వస్తాను. పాప ఉదయం లేచినప్పటి నుంచి బస్ ఎక్కించేంత వరకు బిజీబిజీగా ఉంటుంది. మళ్లీ సాయంత్రం బస్సు కోసం వెయిట్ చేసి ఇంటికి తీసుకొస్తాను. ప్రస్తుత కాలంలో తల్లులే బడికి పోయినంత పని అవుతుంది.

– చకిలం స్వప్న, బోయవాడ

పిల్లల తరువాతే అందరూ



పిల్లలను బడికి పంపించడమే ఫస్ట్.. తర్వాతనే మిగిలివారు. వాళ్లను రెడీ చేసి బడికి పంపిస్తా. లంచ్ బ్రేక్‌కు టిఫిన్ రెడీ చేసి స్కూల్‌కు వెళ్లి తినిపించి వస్తా. నేను లంచ్ చేసే వరకు స్కూల్ టైం అయిపోతుంది. మళ్లీ స్కూల్‌కు వెళ్లి పాపను తీసుకొస్తాను. ఇలా రోజు గడుస్తుంది. మా పాప అల్గునూర్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. – అట్ల మమత, అల్గునూర్

– సప్తగిరికాలనీ(కరీంనగర్), ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పెద్దపల్లిలో కేంద్రం ముందు అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్‌-4

- ఉదయం పరీక్షకు 80.2 శాతం..
- మధ్యాహ్నం పరీక్షకు 79.92శాతం హాజరు
- వెల్లడించిన కలెక్టర్ సంగీత



అనుమతించాలని కోరుతున్న అభ్యర్థులు



ధర్మారంలో ప్రాధేయపడుతున్న అభ్యర్థులు



జూలపల్లిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంగీత



మంథనిలో ఫ్లెక్సీ, దారికి అడ్డుగా కర్రలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శనివారం నిర్వహించిన గ్రూప్‌–4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 17,927మంది అభ్యర్థుల కోసం జిల్లావ్యాప్తంగా 43 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్షకు 17,927 మందికి 14,378 మంది, మధ్యాహ్నం పేపర్‌కు 14,327 మందికి 10,727 మంది హాజరైనట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. పరీక్షకు ఆలస్యంగా వచ్చిన కొందరు అభ్యర్థులు వెనుదిరిగారు. పెద్దపల్లి డిగ్రీ కాలేజీకి ఇద్దరు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. ధర్మారంలో అదే గ్రామానికి చెందిన సంతోష్‌నాయక్, మరోఇద్దరు ఆలస్యంగా రాగా వారిని అనుమతించలేదు. తాను సరైన సమయానికి వచ్చినా ఎందుకు అనుమతించడం లేదని సంతోష్‌నాయక్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. జూలపల్లిలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సంగీత తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతు

మంథని: అధికారుల అలసత్వంతో మంథనిలో ముగ్గురు పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. గ్రూపు–4 పరీక్షలకు రామగిరి జేఎన్టీయూతోపాటు మంథనిలో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకులం, ప్రభుత్వ బాలికల కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాల, గురుకులం పట్టణ శివారులో ఉండడంతో అభ్యర్థులు అసౌకర్యానికి గురయ్యారు. డిగ్రీ కళాశాల బస్టాండ్ నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉంది. ఆ కళాశాలకు వెళ్లే దారికి మరమ్మతు చేస్తున్నారు. ఎస్‌బీఐ ముందు నుంచి దారి చూపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసినా.. దారికి అడ్డంగా బోర్డు, కర్రలు పెట్టారు. దీంతో కేంద్రానికి ఎలా వెళ్లాలో తెలియక అభ్యర్థులు తికమక పడ్డారు. కనీసం సమాచారం చెప్పేవారు లేక మరోదారి గుండా కేంద్రానికి చేరుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ అభ్యర్థి కేవలం నిమిషం ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. తాను దారి కోసం 45 నిమిషాలు తిరిగానని ఆవేదన వ్యక్తం చేసిన అధికారులు ససేమిరా అన్నారు. గోదావరిఖని చెందిన మరో ఇద్దరు ఆలస్యంగా రావడంతో అనుమతి ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- ఉచితంగా 134 రకాల రోగనిర్ధారణ పరీక్షలు
- రేడియాలజీ, పాథలాజీల్యాబ్‌ల ఏర్పాటు
- వర్చువల్ పద్ధతిన ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు
- జిల్లాలో హాజరైన మంత్రి కొప్పుల, జెడ్పీ చైర్మన్ మధు, కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: పల్లె ప్రజలకు స్థానికంగా ఉన్న జిల్లా ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం ఉచితంగా అందించేలా ప్రభుత్వం ఆధునిక సాంకేతికతో కూడిన సేవలను అందుబాటులోకి తెచ్చిందని వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్, డయాలసిస్ కేంద్రాలను ఆయన వర్చువల్ పద్ధతిన శనివారం ప్రారంభించగా.. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ సంగీత, జెడ్పీచైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి వంటి మారుమూల ప్రాంతాల్లో అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని మంత్రి ఈశ్వర్ అన్నారు. డయాగ్నోస్టిక్ హబ్‌లో ఎక్స్‌రే, 2డిఈకో, అల్ట్రాసౌండ్, ఈసీజీ, యూసీజీ, పాథాలజీ ల్యాబ్ అందుబాటులోకి వచ్చాయన్నారు. గర్భిణుల కోసం అల్ట్రాసౌండ్, టిఫా స్కాన్ అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌ను మంత్రి ఈశ్వర్ ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని నలుగురు గిరిజనులకు 1.39 ఎకరాలకు పోడు పట్టాలను పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, రైతుబంధుసమితి అధ్యక్షుడు అనంతరెడ్డి, జెడ్పీటీసీలు రామ్మూర్తి, తిరుపతిరెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్ తదితరులున్నారు.



ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్, కలెక్టర్ సంగీత, జెడ్పీ చైర్మన్ మధు తదితరులు

క్లుప్తంగా

ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్ తనిఖీ



వివరాలు సేకరిస్తున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య

గోదావరిఖని: ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్‌ను కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య శనివారం తనిఖీ చేశారు. అధికారులతో సమావేశమై ఎక్స్‌పోజివ్ తరలించే వాహనాల్లో రక్షణ పరమైన పరికరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించే అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎక్స్‌ప్లోజివ్స్ జీఎం క్రిష్ణగోపాల్‌తివారీ, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య ఉన్నారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–1,3 గనిలో రక్షణపై సమావేశమయ్యారు.

కంది సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

కమాన్‌పూర్: వరి, పత్తికి బదులు రైతులు కంది సాగు చేయాలని, తద్వారా లాభాలు సాధించవచ్చని రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కిరణ్ పిల్లి, వినోద్‌కుమార్ సూచించారు. రత్నాపూర్‌లో కంది సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కంది సాగుచేసే రైతులకు కేవీకే ఆధ్వర్యంలో ఉచితంగా విత్తనాలు, క్రిమి సంహారక మందులను ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ, రైతులు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాల అమలులో అలసత్వం



మాట్లాడుతున్న శశిభూషణ్ కాచే

మంథని: బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేయలేదని టీపీసీసీ ఎలక్షన్ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే అన్నారు. శనివారం మంథని తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆర్డీవో లేదా తహసీల్దార్ నిర్వహించాల్సి ఉండగా కిందిస్థాయి అధికారి మొక్కుబడిగా ఏర్పాటు చేయడంపై కాచే అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రభావిత, పునరావాస గ్రామాలైన పెద్దంపేట, మంగళిపల్లి, జల్లారం, లద్నాపూర్, రచ్చపల్లి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలన్నారు.

బిల్లులు చెల్లించకుంటే 10 నుంచి సమ్మె

పెద్దపల్లిరూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్లు శనివారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకుంటే ఈనెల 10 నుంచి సమ్మెకు దిగుతామని ప్రజాప్రతినిధులు, అధికారులకు నోటీసులను అందజేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి వినతిపత్రాలు అందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేశ్, నాయకులు ఓదెల రమేశ్, లంక విజయ, సిరిశెట్టి తిరుపతి, జంగా లక్ష్మి, స్వరూప, సుమలత, లావణ్య, కళావతి, జుబేదా పాల్గొన్నారు.

భిక్షగాడిపై దాడి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పశువుల వారసంత వద్ద చిన్న కాల్వలకు చెందిన గడ్డం శంకర్‌పై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం ప్రకారం.. శంకర్ భిక్షాటన చేస్తుంటారు. అతడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల పరిధి మారుతినగర్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఓదెల మండలం కనగర్తికి చెందిన నక్క శ్యాం, పెర్క కరుణాకర్ ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం సుల్తానాబాద్‌కు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయారు. గాయపడిన ఇద్దరిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుద్రంగి.. వస్తోంది

సండే స్పెషల్





ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో బాలకృష్ణ, జగపతిబాబు, రసమయి బాలకిషన్



రుద్రంగి సినిమాలోని ఓ సన్నివేశం

• గాయాల ముల్లె.. ఆ పల్లె • వెండితెరపై కల్లోల పల్లె కథ • ఈనెల 7న విడుదల

రుద్రంగి రక్తచరిత్రకు సాక్ష్యం. నిత్య కల్లోలంతో పిడికెడు మట్టిని పిసికితే చారెడు కన్నీళ్లు రాలిన నేల. రాత్రయితే చాలు.. బిక్కుబిక్కుమంటూ గడిపిన క్షణాలు.. ఇక్కడ పెరిగిన చెట్టుకు.. ఎగిరే పిట్టకు.. పుట్టకు.. గుట్టకు.. కన్నీటి కథలు తెలుసు.. తుపాకీ మోతలు.. గాలిలో కలిసే ప్రాణాలు.. ఇందిరమ్మ బొమ్మ సాక్షిగా తలను వేరు చేయబడిన మొండెం కళ్ల ముందు కనిపించిన దృశ్యం .. అణచివేత... తిరుగుబాటుకు సాక్ష్యం రుద్రంగి. ఊరు పెద్దదే అయినా.. దొరలు, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి చిత్రరూపమిస్తూ.. రుద్రంగి సినిమా రూపుదిద్దుకుంది. ఈ నెల 7న విడుదల కాబోతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రుద్రంగి సినిమాపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్.. – సిరిసిల్ల

దాడులు.. ప్రతిదాడులు

మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి రుద్రంగి స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో నక్సలైట్లు, పోలీసుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో ప్రభుత్వం శాంతిచర్చలు జరిపింది. ఈ చర్చలు ముగియగానే శాంతిని భగ్నం చేస్తూ ఎదురుకాల్పులు జరిగింది ఇక్కడే. మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. అంతకుముందు కొచ్చెగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు జనశక్తి నక్సలైట్లు మరణించారు. రుద్రంగి శివారులోని లింగంపేట వద్ద నక్సలైట్లు పేల్చిన మందుపాతరకు చందుర్తి ఎస్సై శ్రీనివాస్‌రావు మృత్యువాత పడ్డారు. చందుర్తి ఎంపీపీ గంగరాజంను నక్సలైట్లు ఇన్‌ఫార్మర్‌గా పేర్కొంటూ రుద్రంగిలో కాల్చిచంపారు. అంతకుముందు లక్ష్మి అనే మహిళను ఇన్‌ఫార్మర్ నెపంతో తల నరికి ఇందిరమ్మ విగ్రహానికి కట్టిన ఘటన అప్పట్లో సంచలనం. దాడులు, ప్రతిదాడులతో ఆ రుద్రంగి కన్నీటి ధారగా మారింది. పక్కనే దట్టమైన అడవి ఉన్న మానాల, మరిమడ్ల, వట్టిమల్ల, కలికోట, అంబారిపేట గిరిజనతండా, కొత్తపేట, లింగంపేట చుట్టూ ఊర్లతో రుద్రంగి కల్లోలమైంది. రుద్రంగిలో కొండాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల పేరుతో జనశక్తి అమరవీరుల స్థూపం ఉంది. ఆ ఊరిపై ఉద్యమ గీతాలెన్నో జనబాహుళ్యంలోకి వెళ్లాయి.

ఎగిసి పడిన ఉద్యమాల ఖిల్లా

రుద్రంగి సలుపుతున్న గాయాలముల్లె. వలపోతల కన్నీటిధార. 1975 దశకంలో ఎగిసిపడిన నక్సలైట్ ఉద్యమ కెరటం. చుక్కనీరు దొరకని దైన్యం. నిరుద్యోగం నిచ్చెన మెట్లతో గల్ఫ్ దేశాలకు వలసపోయిన బతుకులు. భూస్వామ్యపు అణచివేతలు.. చుట్టూరా ఎత్తయిన గుట్టలు.. గుట్ట కింద కుప్ప పోసినట్లుగా ఉండే ఇళ్లు. అందులో తాతల నాటి పెంకుటిండ్లే ఎక్కువగా కనిపిస్తాయి. గల్ఫ్ సిరులు తెచ్చిన బిల్డింగులు.. పదిహేను వేల జనాభాతో ఉన్న ఆ పల్లె రుద్రంగిగా వెండితెర కెక్కింది. రుద్రంగి ఒకప్పుడు సిరిసిల్ల నియోజకవర్గంలో పెద్ద ఊరు. నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో ఓ మండల కేంద్రం. పసుపు, వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో ఆ పల్లె ఇప్పుడు పసిడి రాశులతో కళకళలాడుతోంది.



నిర్మాత మనోడే..

రుద్రంగి పేరుతో వస్తున్న ఈ సినిమాను 1960–90 ప్రాంతంలో జరిగిన సంఘటనలు, భూస్వామ్య వ్యవస్థ నేపథ్యంలో చిత్రీకరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఈ చిత్రానికి నిర్మాత కాగా, అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహిస్తున్నారు. జగపతిబాబు, ఆశీష్‌గాంధీ, విమలారామన్, మమతా మోహన్‌దాస్ ప్రధాన పాత్రల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలకు రైటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న అజయ్‌సామ్రాట్ దర్శకుడు కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. 'రుద్రంగి నాది.. రుద్రంగి బిలాంగ్స్ టు మి' అంటూ జగపతిబాబు చెప్పే డైలాగ్ గంభీరంగా ఉంది. జాలి, దయ లేని భీమ్‌రావు దొరగా జగపతిబాబు నటిస్తున్నారు. మొత్తానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉన్న మేజర్ గ్రామం రుద్రంగిని వెండితెరకు ఎక్కించడం విశేషం. ఆ సినిమా ఎలా ఉంటుంది.. రుద్రంగి టైటిల్‌తో ఏం చెబుతారో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈనెల 7న విడుదలకు సిద్ధమైంది. ఇటీవల ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ హీరో బాలకృష్ణ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు దర్శకత్వంలో ఇటీవల వచ్చిన 'బలగం' సినిమా విజయవంతం కాగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా నేపథ్యంలో మరో సినిమా 'రుద్రంగి' వెండితెరపైకి రావడం విశేషం.

మా ఊరిలో నేను ఒక్కడినే నటించాను



మా సొంతూరు రుద్రంగి. మా ఊరి పేరుతో వస్తున్న సినిమాలో నాకు నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాపై మా ఊరి అందరిలో ఆసక్తి పెరిగింది. మరో ఐదు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రుద్రంగి రాబోతుంది. ఆ సినిమాను వెండి తెరపై చూస్తేనే ఆసక్తిగా ఉంటుంది.

– తోకల తిరుమల్, రుద్రంగి యువకుడు

మొదటి త్రైమాసికంలో వందశాతం ఉత్పత్తి



బొగ్గు వెలికితీస్తున్న భారీ షావల్

ఏరియాల వారీగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడునెలల్లో సాధించిన బొగ్గు ఉత్పత్తి మిలియన్ టన్నుల్లో..

ఏరియా	టార్గెట్	సాధించింది	శాతం
ఆర్జీ–1	1.09	1.04	96
ఆర్జీ–2	2.28	2.23	98
ఆర్జీ–3	1.26	1.26	101
ఏపీఏ	0.43	0.22	51
కొత్తగూడెం	3.01	3.46	115
ఇల్లెందు	0.73	0.96	131
మణుగూరు	2.98	3.62	122
బెల్లంపల్లి	0.85	0.98	116
మందమర్రి	1.11	1.00	90
శ్రీరాంపూర్	1.75	1.47	84
భూపాల్‌పల్లి	1.11	0.81	73
నైనీ	0.10	-	-

• ఉత్పత్తిలో ఐదు ఏరియాలు టాప్

గోదావరిఖని: మొదటి త్రైమాసికంలో సింగరేణిలో వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 78 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం నిర్ణయించింది. ఈ త్రైమాసికంలో 16.74మిలియన్ టన్నులు లక్ష్యంగా కేటాయించగా 17.10మిలియన్ టన్నులు సాధించి 102 శాతం నమోదు చేశాయి. సంస్థ వ్యాప్తంగా 11ఏరియాల్లో ఐదు ఏరియాలు బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచాయి. నైనీ బ్లాక్‌కు ఉత్పత్తి లక్ష్యాలు కేటాయించినప్పటికీ బొగ్గు ఉత్పత్తి ఇంకా ప్రారంభం కాలేదు. సంస్థ వ్యాప్తంగా ఏపీఏ ఏరియా 54శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి లక్ష్యాల సాధనలో వెనకపడింది. 131శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ఇల్లెందు ఏరియా సంస్థలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడంతో ఓసీపీల్లో పెద్దగా ఉత్పత్తికి ఆటంకం కలగలేదు. రానున్న మూడు నెలల్లో కూడా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్లు ఇప్పటికే అన్ని ఏరియాల జీఎంలకు దిశానిర్దేశం చేశారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు రక్షణపై మరింత దృష్టి సారించారు. పెరిగిన బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా డిస్పాచ్‌లు కూడా వేగవంతం చేస్తున్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోటీలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని మూడు క్రీడాపాఠశాలల్లో 4, 5వ తరగతిలో చేరేందుకు అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల 4న స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సురేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థులు 01–09–2014 నుంచి 31–08–2015 మధ్య జన్మించి ఉండాలని, ఐదో తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు 31–08–2013 నుంచి 31–08–14 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు స్థానిక ఎంఈఓ ఆఫీసులో సర్టిఫికెట్లను అందించాలన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని పెద్దమ్మనగర్‌కు చెందిన వివాహిత కొలిపాక కవిత (35) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై మహేందర్ తెలిపారు. కుటుంబ కలహాలతో క్షణికావేశంలో అఘాయిత్యం చేసుకుందని పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన కొత్తూరి లక్ష్మి (50) శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఎస్సై మహేందర్ తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గోదావరిఖని: నిరుద్యోగ యువతకు ఉపాధిలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువత, కార్మికుల పిల్లలు, మాజీ కార్మికుల పిల్లలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్‌లో శిక్షణ ఇస్తామని, ఆసక్తిగలవారు ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని సేవా విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వైద్యుల సేవలు అనిర్వచనీయం



సన్మానిస్తున్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్



సన్మానిస్తున్న ఆర్జీ–2 జీఎం మనోహర్

గోదావరిఖని: కరోన సమయంలో వైద్యులు అందించిన సేవలు అనిర్వచనీయమని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శనివారం వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్‌కట్ చేసి మత్తు వైద్యులు మద్దిలేటిని జీఎం సన్మానించారు. మరో కార్యక్రమంలో ఏసీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. అలాగే ఆర్జీ–2 ఏరియాలోని సెక్టార్–3 డిస్పెన్సరీలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కేక్‌కట్ చేసి వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహిపాల్, డాక్టర్ గౌతమి, ఆదినారాయణ, చంద్రశేఖర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్జీ–1 ఏరియాలో 107శాతం బొగ్గు ఉత్పత్తి

• జీఎం శ్రీ చింతల శ్రీనివాస్



చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లో జూన్‌లో 107శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. 3.17లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగాను 3.41లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందన్నారు. ఏరియాలో ఇప్పటి 1368 మందికి కారుణ్య నియామకాలు అందించామని పేర్కొన్నారు. వర్షాకాలం దృష్ట్యా జీడీకే–5 ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. క్వారీలో వర్షం నీటిని తరలించేందుకు హైకెపాసిటీ మోటార్లను ఏర్పాటు చేశామన్నారు.

చోరీకి గురైన కాపర్ కేబుల్ పట్టివేత

గోదావరిఖని: ఓసీపీ–3లో చోరీకి గురైన కాపర్ కేబుల్‌ను ఆర్జీ–2 సెక్యూరిటీ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. డ్రిల్ సెక్షన్‌లో 30మీటర్ల కాపర్ కేబుల్, డ్రిల్‌కు సంబంధించిన పిన్ చోరీ కాగా.. పెట్రోలింగ్ నిర్వహించి.. వెంకట్రావ్‌పల్లి పంచాయతీ కేకేనగర్ సమీపంలో తుమ్మపొదల్లో స్వాధీనం చేసుకుని జీఎం కార్యాలయానికి తరలించారు. కేబుల్ విలువ రూ.50వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని అధికారులు అభినందించారు.

ఆర్జీ–3లో 116 శాతం బొగ్గు ఉత్పత్తి

• ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న సుధాకర్‌రావు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియాలో జూన్‌లో 3.7 లక్షల టన్నుల లక్ష్యానికి 4.28 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 116 శాతం నమోదు చేసిందని ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు తెలిపారు. తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఓసీపీ–1 నుంచి 139 శాతం, ఓసీపీ–2 నుంచి 86 శాతం ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు 101 శాతం ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. జూన్‌లో 71 శాతం ఓబీ తొలగించామన్నారు. ఓసీపీ–1 నుంచి 6.62లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. సహకరించిన కార్మికులు, కార్మిక నాయకులు, అధికారులకు జీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు గనిలో జూన్‌లో 1.43 టన్నులకు లక్ష టన్నులు ఉత్పత్తి చేసి 70 శాతంతో నిలిచిందన్నారు. ఏరియా ఇంజినీరు ఎలిషా, పీవోలు రాధాకృష్ణ, నరేందర్, ఏజీఎం ఫైనాన్స్ శ్రీనివాసులు, డీజీఎం ఐఈడీ చంద్రశేఖర్, డీజీఎం సివిల్ పద్మరాజు, డీవైపీఎం రవీందర్‌రెడ్డి, డీవైపీఎం మారుతిలు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు

• ఆర్జీ–2లో 92శాతం ఉత్పత్తి
• జీఎం ఎ.మనోహర్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ వెల్లడించారు. ఆయన కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం మాట్లాడారు. ఓసీపీల్లో ఏడు భారీపంపులను ఏర్పాటు చేశామని, వాటితోపాటు ప్రత్యేక బోర్‌వెల్స్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తామన్నారు. ఓబీ వెలికితీతలో ఇబ్బందితో జూన్‌లో పూర్తి స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించలేకపోయామని, త్రైమాసికంలో 22.84టన్నుల లక్ష్యానికి 22.34 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశామని పేర్కొన్నారు. కంటిన్యూస్ మైనర్‌లో పైకప్పు కూలడం ద్వారా వకీల్‌పల్లిగనిలో ఉత్పత్తి తగ్గిందన్నారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మిబాయి, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, సీనియర్ పీఓ మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.